క్లుప్తంగా

నేడు సామాజిక పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు: మండలంలో శనివారం ఉదయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో డి.సురేష్ బాబు తెలిపారు. సంతనూతలపాడు మండలంలో వివిధ వర్గాలకు సంబంధించి 6,729 మంది లబ్ధిదారులకు రూ.2.87 కోట్లను సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల గృహాల వద్ద పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

1660 గొర్రెలు, మేకలు, పశువులకు చికిత్స

సంతనూతలపాడు: మండలంలోని గుడిపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మెగా పశు వైద్య శిబిరంలో 1660 గొర్రెలు, మేకలు, గేదెలు, దూడలు, పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైద్యులు పీ చిరంజీవి, పశు వైద్య సిబ్బంది చికిత్సలు చేశారు. ఆయా పోషకులకు ఈ సందర్భంగా మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పాల ఉత్పత్తి పెంపుదలకు పాడిపోషకులకు తగు సూచనలు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పసుపులేటి మోహన్, కాజా పరశురామిరెడ్డి, పశు వైద్య సిబ్బంది వంశీకృష్ణ, తిరుపాలు, శైలజ, రెహానా, శరణ్ కుమార్, మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

నాగులుప్పలపాడు: గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పశుసంవర్ధక శాఖ ఒంగోలు డివిజన్ ఉపసంచాలకులు ఏ రమేష్ బాబు పేర్కొన్నారు. పశుఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈదుమూడిలో ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువులకు నట్టల నివారణ మందులు తాగించి, వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు పశువైద్యశాల ఏడీ ఎస్ నాగభూషణం, ఈదుమూడి, ఉప్పుగుండూరు పశువైద్యశాలల డాక్టర్లు కే అనురాధ, జాస్మిన్, పాడిరైతులు పాల్గొన్నారు.

గద్దర్ పాటకు మరణం లేదు

ఒంగోలు సిటీ: ప్రజా యుద్ధనౌక గద్దర్ పాటకు మరణం లేదని పలువురు వక్తలు అన్నారు. గద్దర్ సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గద్దర్ జయంతి కార్యక్రమం శుక్రవారం ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ గద్దర్ తన పాట ద్వారా సమాజంలోని దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నించారని, తెలంగాణ ఉద్యమానికి గద్దర్ పాట ఊపిరి పోసిందన్నారు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా, ఊరుమనదిరా ఈ వాడ మనదిరా.. అనే సంచలన గీతాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. అటువంటి ప్రజా గాయకుడు గద్దర్ మరణం ప్రజాసాంస్కృతిక రంగానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో గద్దర్ సాహితీ సాంస్కృతిక సమాఖ్య కన్వీనర్ నూకతోటి శరత్‌బాబు, సీనియర్ అడ్వకేట్ కాటుకూరి బాబూరావు, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ కల్చరల్ కో ఆర్డినేటర్ మిట్నసల శాంతారావు, యరిజర్ల రమేష్, పయనం సురేంద్ర పాల్గొన్నారు.

పచ్చ తమ్ముళ్లకు ఉపాధి

- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో టీడీపీ నేతల చేతివాటం
- సీసీ రోడ్ల నిర్మాణాల్లో అక్రమాలు
- వాడేది గుండ్లకమ్మ ఇసుక.. లెక్కల్లో పెన్నా ఇసుక
- పంచాయతీకి సంబంధం లేకుండా నేరుగా వెండర్ల పేరుతో టీడీపీ నేతల అకౌంట్లకు నిధులు



నరసాయపాలెంలో లో సీసీ రోడ్డు నిర్మాణంలో ఉన్న దృశ్యం

మద్దిపాడు: కూటమి ప్రభుత్వంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం తెలుగు తమ్ముళ్లకు ఫలహారంగా మారింది. కేంద్రం నుంచి వచ్చే నిధులను అప్పనంగా కాజేయడానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను ఎంచుకుంది. సంక్రాంతికి పల్లె పండుగ పేరుతో భారీగా నిధులను ఎంజీఎన్



లింగంగుంట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంలో ఉన్న దృశ్యం

ఆర్‌ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి ఉన్నత స్థాయిలో అనుమతులు ఇచ్చారు. పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణలో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు మంజూరు చేశారు. మద్దిపాడు మండలంలో ముందుగా 29 పనులకు రూ.3.30 కోట్లు మంజూరు చేశారు. ఇటీవల మళ్లీ ఐదు గ్రామాల్లో రూ.1.50 కోట్ల నిధులు సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ సిఫార్సుల మేరకు ప్రతి గ్రామంలో తెలుగు తమ్ముళ్లకు పనులు కేటాయించారు. కానీ మండలంలోని అన్ని గ్రామాల పనులు నలుగురు వ్యక్తులు సిండికేట్‌గా మారి చేయిస్తున్నారు. మంజూరైన పనులకు వీరి ద్వారానే ఎమ్మెల్యేకు వాటా వెళుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో కేంద్రం పెట్టిన ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్) యాప్‌ను ద్వామా వారి ద్వారా సవరించి వెండర్ అనే ఆప్షన్‌ను అనుసంధానించారు. ఈక్రమంలో వెండర్ స్థానంలో తెలుగు తమ్ముళ్ల పేరు, ఫోన్ నంబర్ ఎంటర్ చేయగానే వెండర్‌కు చెందిన బ్యాంక్ అకౌంట్ ఓపెన్ అవుతుంది. దీని ద్వారా గ్రామ పంచాయతీకి ఎటువంటి సంబంధం లేకుండా నేరుగా టీడీపీ నేతల ఖాతాల్లో నిధులు జమయ్యేలా ఏర్పాటు చేశారు. గతంలో పంచాయతీని యూనిట్‌గా తీసుకుని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు పంచాయతీకి జమయ్యేవి. ఆవిధంగా కాకుండా ఎన్ఐసీకి వెండర్ ఆప్షన్‌ను జత చేయడంతో నేరుగా టీడీపీ నేతల ఖాతాల్లోకి డబ్బులు వెళుతున్నాయి. ఆవిధంగా పర్సనల్ అకౌంట్‌లకు, వెండర్ అకౌంట్‌లకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మళ్లించడానికి అసలు నిబంధనలు అంగీకరించవు. కానీ నిధులు కాజేయడానికి కూటమి ప్రభుత్వం వేసిన ఎత్తు ఇది. జిల్లాలో అధికారిక ఇసుక రీచ్ లేకపోవడంతో నెల్లూరు జిల్లా పెన్నా నది రీచ్‌ను ప్రకాశంకు కేటాయించారు. ఈక్రమంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక అక్కడి నుంచి కొనుగోలు చేయాల్సిన టీడీపీ నేతలు స్థానిక ఎమ్మెల్యే అండతో మండలంలోని గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వి సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. అంతే కాకుండా బిల్లులు మాత్రం పెన్నానది నుంచి ఇసుక తరలించినట్లు చూపుతూ అక్కడ కూడా చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. ఇది కాకుండా మండలంలోని ఏడుగుండ్లపాడు, లింగంగుంట గ్రామాల మధ్య ఉన్న డొంక రోడ్డు సుమారుగా 1.5 కిలోమీటర్ల రోడ్డు బీటీ రోడ్డుగా మార్చడానికి రీచ్–1, రీచ్–2 అంటూ రూ.35 లక్షల చొప్పున రూ.70 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధుల సేకరణకు పనిదినాలు కావాల్సి ఉండగా జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల పనిదినాలు చేయిస్తేనే ఈ డబ్బు కేంద్రం ద్వారా అందుతుంది. దీనికోసం జిల్లాలో ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఎంపీడీఓలు, ఏపీఓలను ఒత్తిడి చేస్తున్నారు. సాధారణంగా మార్చి నెల నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభం అవుతాయి. కానీ కూటమి ప్రభుత్వంలో మాయాజాలంతో ఉపాధి పనులు జనవరి నెల నుంచి ప్రారంభమయ్యాయి.

స్పందన, రెవెన్యూ సదస్సుల అర్జీలపై సమీక్ష



అర్జీలపై సమీక్ష నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్

సంతనూతలపాడు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ స్పందనకు వచ్చిన మండల అర్జీలు, రెవెన్యూ సదస్సుల అర్జీలు, రీ సర్వే తదుపరి మండలంలోని గ్రామాల అర్జీలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ వరకుమార్ సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే మాబు సుభాని, వీఆర్వోలతో ఆయా అర్జీలపై సమీక్షించారు. సంతనూతలపాడు మండలానికి చెంది..కలెక్టరేట్ స్పందనకు గత రెండేళ్లలో 528 అర్జీలు దాఖలు కాగా 502 అర్జీల సమస్యలను పరిష్కరించినట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేర్కొన్నారు. మరొక 26 పెండింగ్ అర్జీల పరిష్కారంపై సమీక్షించినట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి 402 రైతుల అర్జీల్లో నేటి వరకు 119 అర్జీలను పరిష్కరించినట్టు తెలిపారు. మరొక 282 అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 22వ తేదీ లోపు వాటిని పరిష్కరిస్తామన్నారు. రీ సర్వే నిర్వహించిన తదుపరి గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను కూడా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌ఓను మర్యాదపూర్వకంగా కలిసిన మలేరియా అధికారి మధుసూదనరావు

- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: జిల్లాలో మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలకుండా నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) టీ వెంకటేశ్వర్లు.. జిల్లా మలేరియా అధికారి ఎస్ మధుసూదన్‌రావుకు సూచించారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన మలేరియా అధికారి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పలు సూచనలు చేశారు.

ట్రైబల్ ప్రాంతాల్లో నిఘా ఉంచి గృహ సందర్శనలు విధిగా నిర్వహిస్తూ మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలను అరికట్టాలన్నారు. దీనిలో మలేరియా అధికారులు శేషుబాబు, శ్రీనివాసులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగ్రాతులను ఆస్పత్రికి తీసుకెళ్తే ఇబ్బందులుండవ్

- గుడ్ సమ్మారిటన్‌పై అవగాహన కార్యక్రమాలు



గుడ్ సమ్మారిటన్‌పై అవగాహన కల్పిస్తున్న రవాణా అధికారులు

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తీసుకెళ్లిన వారిని గుడ్ సమ్మారిటన్ అంటారని, అటువంటి వారిపై ఎటువంటి కేసులు ఉండవని, విచారణకు పిలవరని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆ మేరకు జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, కిమ్స్, సంఘమిత్ర ఆస్పత్రుల వద్ద గుడ్ సమ్మారిటన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆస్పత్రులకు తీసుకెళ్లిన వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని, పైగా కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల బహుమానం కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళన లేకుండా క్షతగాత్రులను హాస్పిటల్స్‌కు చేర్చవచ్చన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు. ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది, రోగులకు అవగాహన కల్పించి ఆయా ప్రాంతాల్లో రహదారి భద్రత అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. మోటార్ వాహనం తనిఖీ అధికారులు కె. రామచంద్రరావు, ఏ.కిరణ్ ప్రభాకర్, ఎల్.సురేంద్రప్రసాద్, ధర్మేంద్ర, భాను ప్రకాష్, శ్రీనివాసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడి జీర్ణోద్ధరణలో బూచేపల్లి



పోలేరమ్మ గుడి పునః ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

చీమకుర్తి రూరల్: మండలంలోని కేవీ అగ్రహారం గ్రామంలో పోలేరమ్మ గుడి జీర్ణోద్ధరణ చేశారు. శుక్రవారం ఉదయం పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పూజలు చేశారు. సర్పంచ్ దేవరపల్లి వెంకటలక్ష్మి రామారావు, రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అందరం కలిసి అభివృద్ధి చేసుకుందాం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

- ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్
- చీమకుర్తి మున్సిపల్ కౌన్సిల్లో అజెండాకు ఆమోదం

చీమకుర్తి: అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకొస్తాను... అందరం కలిసి చీమకుర్తి మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ అన్నారు. శుక్రవారం చీమకుర్తి మున్సిపాలిటీ సమావేశం నిర్వహించారు. 16 అంశాలతో అజెండాను మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశంలో ప్రవేశపెట్టారు. అజెండాను ఆమోదించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పార్కులు, సామాజిక భవనాల నిర్మాణానికి నిధులను కావాలని కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్‌లు బాపతు వెంకటరెడ్డి, ఎస్.మాణిక్యతో పాటు కొంతమంది కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేని సత్కరించారు.

వ్యాక్సిన్లు సకాలంలో వేయించాలి



పోషకులకు నట్టల నివారణ మందులు అందజేస్తున్న డాక్టర్ మనురూప్

చీమకుర్తి రూరల్: పశువులకు సకాలంలో వ్యాక్సిన్లు వేయిస్తే అనారోగ్యానికి గురికావని పశువైద్యుడు టీ మనురూప్ అన్నారు. మండల పరిధిలోని గాడిపర్తివారిపాలెం గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో పశువులను పరీక్షించి చికిత్స అందించారు. నట్టల నివారణ మందులు ఇచ్చారు. 2500 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, 15 దూడలకు, 150 ఆవులు, గేదెలకు నట్టల నివారణ మందులు తాగించారు. పశువులకు చూడి, ఎద పరీక్షలు చేసి ఇంజెక్షన్లు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయ్య వీరయ్య, ఉప సర్పంచ్ సుడిదెల వెంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్వర్ణలత



స్వర్ణలతను సన్మానిస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు: మండలంలోని ఈదుమూడి జిల్లా పరిషత్ హైస్కూల్ కు చెందిన సైన్స్ ఉపాధ్యాయురాలు కాకి స్వర్ణలత దక్షిణ భారత స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ చూపి బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సభలో ఆమెను సత్కరించారు. సన్మాన సభలో పాఠశాల స్థలదాత కూనం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ స్వర్ణలత గత 8 సంవత్సరాల నుంచి ఇదే పాఠశాలలో పనిచేస్తూ సైన్స్ లో విద్యార్థులను మంచి ప్రావీణ్యత సాధించేలా తీర్చిదిద్దారన్నారు. పాఠశాల అభివృద్ధిలో తనువంతు పాత్ర పోషించి, గ్రామానికి పాఠశాలకు మంచిపేరు తీసుకువచ్చారని అభినందించారు. అనంతరం స్వర్ణలతను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీ శంకరరావు, గ్రామస్తులు కూనం చినవీరయ్య, ప్రేమ్ చంద్, కె వెంకట్రావు, ఉపాధ్యాయులు కె శంకరరావు, గాదంశెట్టి శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పది వేల కోట్లు కేటాయించాలి



ఒంగోలు చేరిన సీపీఎం జాతా

ఒంగోలు సిటీ: వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి, పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి 10 వేల కోట్ల నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాబు డిమాండ్‌చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసులు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వలసలతో జిల్లా వెనకబడి ఉందని, సగానికి పైగా గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరు తాగుతూ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమలు, ఉపాధి, ప్రజా రవాణా, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీరు, వైద్యం, విద్య వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోనే ఉంచాలన్నారు. నిలిచిపోయిన నిర్మాణ పనులు వేగవంతం చేసి 2025–26 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించాలన్నారు. ఐదు నియోజకవర్గాల ప్రజలకు సాగు,తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



కడియాల ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని కరవది పీఆర్‌ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయిని పి.బాలకోటేశ్వరమ్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు కడియాల ప్రసాద్‌ల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అధ్యక్షతన జరిగింది. పలు మండలాల నుంచి ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహా ఉపాధ్యాయ, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొని పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు రూ.25 వేల విలువ చేసే రెండు బీరువాలను పాఠశాలకు బహూకరించారు. ఒంగోలు నియోజకవర్గంలో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులకు రూ.45 వేలు విలువ చేసే క్రీడా దుస్తులు అందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కడియాల ప్రసాద్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం తన తల్లి మాణిక్యమ్మ (96) సమక్షంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

అధికార దర్పం





ఒంగోలు: జిల్లా కేంద్రం ఒంగోలులో వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వద్ద స్వామి భక్తి చాటుకుంటున్నారు. పనిలో పనిగా ఆయన కూడా అధికార దర్పం ప్రదర్శిస్తున్నారు. నగరంలో ఎక్కడా లేని విధంగా ఎమ్మెల్యే నివాసం ఎదుట రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అది స్కూల్ జోన్ కాదు, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతం కాదు.. కేవలం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసానికి వెళ్లే మార్గం. ట్రంకు రోడ్డులోని బీకే అపార్టుమెంట్ ఎదుట రోడ్డుపై మూడు పెద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్లు వేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్ల మధ్య కదల్లేక బస్‌లు, కార్లు ఇరుక్కుపోతున్నాయి. మహిళలు ద్విచక్ర వాహనంపై కాళ్లు అందక ఎక్కడ పడిపోతామో అనే భయంతో అత్యంత కష్టంగా స్పీడ్ బ్రేకర్స్ దాటుతున్నారు. ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకోవడం కోసం ఇలా ప్రధాన రోడ్డుపై అడ్డదిడ్డంగా పెద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



